సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



ఫలితం సాధిద్దాం

విద్యార్థులంతా వారి మేధస్సుకు పదునుపెట్టి తమలో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వేదికపై కనపర్చాలని సైన్స్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

- 8లో



అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ

అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ రాజు అని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

- 8లో



తండ్రీ కొడుకులకు కన్నీటి వీడ్కోలు

రోడ్డు ప్రమాదంలో ఈనెల 25న శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద మృతిచెందిన తండ్రీకొడుకుల మృతదేహాలకు సోమవారం దహన సంస్కారాలు నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

పాఠశాలల సందర్శన తప్పనిసరి

పార్వతీపురం: పాఠశాల ప్రత్యేక అధికారులు పాఠశాలను విధిగా సందర్శించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విద్యావ్యవస్థలో ప్రమాణాలు గణనీయంగా పెరగాలని సూచించారు. ఈ నేపథ్యంలో 'మై స్కూల్ మై ప్రైడ్' కార్యక్రమం క్రింద ఉన్నత పాఠశాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. పాఠశాల సందర్శనలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పుస్తకాల తనిఖీ, పాఠశాల పరిసరాలు, మా బడి మా తోట వంటి కార్యక్రమాలను తనిఖీ చేయాలని చెప్పారు. ముఖ్యంగా పదవ తరగతిలోని వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల్లో అవగాహన స్థాయిని పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో పరిశీలించాలని, అందులో వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్



బాలకృష్ణ

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ పథకం అంగీకారం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో ప్రవేశపెట్టిన కొత్త పథకం గ్యారంటీ పెన్షన్ స్కీమ్ వంటిదేనని, సర్వీసు వ్యవధితో సంబంధం లేకుండా అందరికీ పాత పెన్షన్ వర్తింపజేయడమే న్యాయ సమ్మతమన్నారు. ఇది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు మరో రూపమే తప్ప పాతపెన్షన్ విధానం కాదని సీపీఎస్ పథకంలో లాగానే ఉద్యోగి జీతంలో నుంచి 10% మినహాయింపు ఉంటుందన్నారు. ఏప్రిల్ ఒకటి 2025 నుంచి అమల్లోకి రానున్న కొత్త పెన్షన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ప్రతికూలమైన ఈ పథకాన్ని తిరస్కరిస్తూ పాత విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

28న పశువైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పశుసంచార ఆరోగ్య సేవా వాహనాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇంటర్వ్యూను ఈ నెల 28న నిర్వహించనున్నట్టు పశు సంచార ఆరోగ్య సేవా మేనేజర్ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగిన వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు అర్హులన్నారు. డ్రైవర్ పోస్టులకు 10వ తరగతితో పాటు హెవీ లైసెన్స్ కలిగి, మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

పేరు తొలగించడం తగదు

- మంత్రి శ్రీనివాస్‌కు కొప్పల వెలమ సంఘం ప్రతినిధుల వినతి



మంత్రి శ్రీనివాస్‌తో చర్చిస్తున్న కొప్పల వెలమ సంఘం ప్రతినిధులు

గంట్యాడ: తాటిపూడి జలాశయం నిర్మాణానికి విశేష కృషిచేసిన గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును గత ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ప్రాజెక్టుకు నామకరణం చేసింది.. దానిని తొలగించడం తగదు.. తక్షణమే పునరుద్ధరించాలని కొప్పల వెలమ సంఘం ప్రతినిధులు మంత్రిని కె.శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పుణ్యగిరి కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఎస్.కోట అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

జ్వరాలపై అప్రమత్తం

పార్వతీపురంటౌన్: జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, జ్వరాలతో బాధపడుతున్న వారంతా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జ్వరాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. జ్వరం లక్షణాలు ఉన్నట్లయితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

దోషులను శిక్షించాలి



పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన అటవిక చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా సంఘటన దురదృష్టకరం. వైద్యకళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రిలోకి వచ్చే బయట వారిపై సరైన నిఘాపెట్టాలి. మత్తు పదార్థాలు సేవించేవారిపై చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్.బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం



వైద్యులకు భద్రత కల్పించాలి



ఆస్పత్రుల్లో వైద్యసేవలందించే మహిళా డాక్టర్లకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి. ఆస్పత్రి ప్రాంగణంలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాలి. ఆస్పత్రులకు రోగులను పరామర్శించడానికి వచ్చే వారికి సమయం కేటాయిస్తూ ఎంట్రీ పాస్‌లు సమకూర్చాలి. మహిళలపట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మహిళా డాక్టర్లు విధులు నిర్వహించే ప్రాంతంలో పటిష్టమైన భద్రత విధిగా ఏర్పాటు చేసి ప్రభుత్వం అండగా నిలవాలి.

–డాక్టర్ బి.పావని, సీతానగరం పీహెచ్‌సీ


ప్రాణాలు కాపాడడమే తెలుసు



రోగుల ప్రాణాలు కాపాడడమే తమకు తెలుసు. వైద్యులు దేవుడితో సమానం అంటారు. అటువంటి వారిపై అత్యాచారాలు, హత్యలు చేయడం చాలా దారుణం. ఇటువంటివి జరగకుండా ప్రభుత్వాలు వైద్యులకు పటిష్టమైన భద్రత కల్పించాలి.

– డాక్టర్ శాంతి, ఘోషా ఆస్పత్రి వైద్యురాలు

తవ్వేశాక..తీరిగ్గా!



'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' అన్న చందాన ఉంది అధికారుల తీరు. జిల్లాలో యథేచ్ఛగా ఇసుకాసురులు ఇసుకను తోడేసి తరలించేశాక ఇప్పుడు రీచ్‌లు ఏర్పాటు చేసి ఇసుక పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ద్వారా ఇసుక సరఫరా విధానం ప్రారంభమైనప్పటికీ..జిల్లా అధికార యంత్రాంగం మాత్రం ఇప్పటి వరకూ ఒక్క రీచ్‌నూ గుర్తించలేదు. వర్షాకాలం కావడంతో అనువైన పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఇదే సందర్భంలో అక్రమార్కులు..నదులు, గెడ్డలనే తేడా లేకుండా ఇసుకను తోడేస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు.

- ఇసుక సరఫరాపై ఆలస్యంగా స్పందిస్తున్న అధికార యంత్రాంగం
- ఇప్పటికే భారీగా అనధికార తవ్వకాలు
- భామిని మండలంలో ఇసుక పంపిణీకి సమాయత్తం

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లా మీదుగా అనేక నదులు, గెడ్డలు ప్రవహిస్తుండడంతో ఇసుక నిల్వలకు కొదవ లేదు. జిల్లాలోని ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు కావాల్సినంత వరకు తరలిచేసిన తరువాత తీరిగ్గా స్పందించిన అధికారులు..భామిని మండలం కాత్రగడ(బి) వద్ద ప్రభుత్వం ద్వారా ఇసుక సరఫరాకు సమాయత్తమవుతున్నారు. ఆలస్యంగానైనా గొప్ప నిర్ణయం తీసుకున్నారా? అంటే.. ప్రజల నుంచి పెదవి విరుపే వస్తోంది. ఒడిశా సరిహద్దులో ఆ ప్రాంతం ఉండడం..జిల్లాలోని వినియోగదారులెవరికీ పెద్దగా ఉపయోగపడకపోవడమే ఇందుకు కారణం.

జిల్లాకు సంబంధించి భామిని మండలం కాత్రగడ(బి) ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తీసుకోవడానికి అనుమతులు మంజూరయ్యాయి. ఇక్కడ వంశధార నది నుంచి సుమారు లక్షా 5 వేల టన్నుల ఇసుక సేకరించి, త్వరలో పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వంశధార సైడ్ వియర్ గేట్ల వద్ద ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఇదే కాక..నేరడి(బి), పసుకిడి గ్రామాల పరిధిలో కూడా ర్యాంపుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అనుమతులు వస్తే అక్టోబరు నుంచి ఇసుక పంపిణీ ప్రారంభించాలని భావిస్తున్నారు. ఉచిత పాలసీలో భాగంగా ఇసుక తవ్వే చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. 10 కి.మీ., 25 కి.మీ. వరకు స్థిరమైన చార్జీలు నిర్ణయించి..తదుపరి దూరాన్ని బట్టి కిలోమీటరు వారీగా చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. మెట్రిక్ టన్నుకు కనీస ధర రూ.400లోపు ఉండేలా చర్యలు తీసుకుంటామని ఇటీవల నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. వాస్తవానికి భామిని నుంచి పాలకొండ రావాలన్నా..కనీసం 70 కిలోమీటర్ల దూరం పడుతుంది. పార్వతీపురం రావాలంటే 120 కిలోమీటర్లకు పైగా దూరమవుతుంది. ఈ లెక్కన రవాణా చార్జీలతో కలిపి లారీ లోడు రూ.20 వేలకు పైగానే అవుతుంది. ప్రస్తుతం కాత్రగడ, పసుగుడి ప్రాంతాల నుంచి అనధికారికంగా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. లారీ ఇసుకకు రూ.30 వేల వరకు అనధికార ముఠా వసూలు చేస్తోంది. పాలకొండ వాసులకు సమీప నదీ తీర ప్రాంతాల నుంచి ఇసుక తేవాలన్నా..ట్రాక్టరు లోడుకు ప్రస్తుతం రూ.5 వేలకుపైగా వసూలు చేస్తున్నారు. దీని ప్రకారం భామిని నుంచి ఇసుక తరలించాలంటే.. ఇంకెంత అవుతుందోనని వినియోగదారులు భయపడుతున్నారు.



ఇటీవల కొమరాడ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

ఇక్కడ వదిలేస్తూ.. అక్కడ చోద్యం చూస్తూ..

వాస్తవానికి భామిని వంశధార ప్రాంతం నుంచి కొంతకాలంగా ఇసుక దోపిడీ సాగుతోంది. రాత్రి వేళ జేసీబీలతో తవ్వుతూ, లారీలకు లారీల లోడు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతోంది. ఇందులో స్థానిక కూటమి నాయకులు, అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే సందర్భంలో జిల్లాలో ఏ మూల చూసినా నదీ పరీవాహక ప్రాంతాలు, గెడ్డలే. స్థానిక అవసరాలకు ఎక్కడా ఇసుక కొదవ లేదు. ఆయా ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. ఎడ్లబళ్ల ద్వారా స్థానిక అవసరాలకు తరలించుకోవచ్చన్న మినహాయింపు ఉండడంతో యథేచ్ఛగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతూ సొమ్ము చేసుకుంటున్నారు.

- కురుపాం నియోజకవర్గంలోని కొమరాడ మండలం కూనేరు– రామభద్రపురం నాగావళి వద్ద పుష్కలంగా ఇసుక నిల్వలున్నాయి. ఇదే మండలం కళ్లికోట, జియ్యమ్మవలస మండలం బిత్రపాడుల్లో కూడా నాగావళి నదీ తీరం నుంచి పెద్ద ఎత్తున నాటుబళ్లతో ఇసుకను తరలిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో పలు గెడ్డలు ఉన్నాయి. స్థానిక అవసరాలకు ఇక్కడ ఇసుక సరిపోతోంది.
- సాలూరు నియోజకవర్గానికి సంబంధించి ఆ ప్రాంత వాసులకు వేగావతి, వట్టిగెడ్డ, గోముఖి, సువర్ణముఖి నదులు అందుబాటులో ఉన్నాయి. సాలూరు పట్టణానికి ఇసుక కావాలంటే..వేగావతి నుంచి ఒకటిరెండు కిలోమీటర్లలోపే దూరం. ఎడ్ల బండి రూ.600 చొప్పున అనధికారికంగా విక్రయిస్తున్నారు. పెద్ద భవనాలకు సైతం బళ్ల ద్వారానే ఇసుక తెప్పించుకుంటున్నారు. పాచిపెంట మండలంలోని వట్టిగెడ్డలో కూడా ఇసుక లభ్యత సమృద్ధిగా ఉంది. మోసూరు గ్రామం వారే బయటకు తరలిస్తుంటారని సమాచారం. రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద వట్టిగెడ్డ కూడా సాలూరుకు సమీపంలోనే ఉంది. మక్కువ మండలం డి.శిర్లాం దగ్గర గోముఖి– సువర్ణముఖిల దగ్గర గతంలో ప్రభుత్వ రీచ్ ఉండేది. ప్రస్తుతం అనుమతులు లేకున్నా..ఇసుక తవ్వకాలు జోరుగానే సాగుతున్నాయి. ఈ నియోజకవర్గంలోని మండలాలకు బయట నుంచి ఇసుక తెచ్చుకోవాల్సిన పరిస్థితులు లేవు.
- పార్వతీపురం నియోజకవర్గం వారికి ఇసుక కావాలంటే..అటు కొమరాడ నాగావళి నదీ తీర ప్రాంతం..ఇటు సీతానగరం వద్ద సువర్ణముఖి నది అందుబాటులో ఉంది. అనధికార విక్రయాల వల్ల ట్రాక్టర్ లోడుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది.
- పాలకొండ మండల పరిధిలోని గోపాలపురం, అన్నవరం, వీరఘట్టం మండలం పనసనందివాడ, బీటీవాడ తదితర ప్రాంతాల మీదుగా కిలోమీటర్ల పొడవునా నాగావళి నదీ తీరం ఉంది. ఇక్కడ నుంచి కూడా నాటుబళ్లు, ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఇసుక తరలిపోతోంది. స్థానిక అవసరాలకు కూడా ఇదే సరిపోతుంది.

ఇన్ని అవకాశాలున్నప్పటికీ..ఒడిశా సరిహద్దులోని భామిని వంశధార తీరం వద్ద అనుమతులకు అధికారులు ప్రయత్నించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పోనీ, ఈ రకంగానైనా కనీసం అక్కడ అక్రమ తవ్వకాలు ఆగుతాయో, లేదో చూడాలి.

గజ..గజ..

- రైతు కూలీని హతమార్చిన గజరాజుల గుంపు
- 13కు చేరిన ఏనుగుల దాడిలో మృతుల సంఖ్య
- ఆందోళనలో కొమరాడ మండల ప్రజలు



ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన శివున్నాయుడు

కొమరాడ: తనకంటూ ఎవరూ లేని ఆ వ్యక్తి ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో పొట్టపోసుకునేందుకు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొమరాడ మండలంలోని వన్నాం గ్రామానికి చెందిన వాన శివున్నాయుడు (69) ఏనుగుల దాడిలో సోమవారం మృతి చెందడం అందరి హృదయాలనూ కలిచివేసింది. వ్యవసాయ కూలి పనికి వెళ్లిన శివున్నాయుడు గ్రామ సమీపంలోని అరటి తోటలో పనిచేస్తుండగా గజరాజుల గుంపు ఒకసారిగా దాడి చేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటనతో వన్నాం గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న ఎస్సై నీలకంఠం, అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్లుగా ఏనుగుల అలజడి

2018 సెప్టెంబర్ నెలలో శ్రీకాకుళం జిల్లా నుంచి ఎనిమిది ఏనుగుల గుంపు పార్వతీపురం మన్యం జిల్లాలోని జియ్యమ్మవలస మండలంలో ప్రవేశించింది. అక్కడి నుంచి కొమరాడ మండలంలోకి ప్రవేశించిన తరువాత జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో కొమరాడలో రెండు, గరుగుబిల్లి మండలంలో ఒక ఏనుగు మృతి చెందాయి మరో ఒంటరి ఏనుగు (హరి) ఒడిశాలోని కొండ ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో దాని జాడ కనిపించడం లేదు.

ఏనుగుల గుంపు ఈ ప్రాంతానికి వచ్చిన తరువాత రెండు గున్న ఏనుగులు జన్మించాయి. ఈ ప్రాంతంలో నిత్యం సంచరిస్తున్న ఏనుగులు వేలాది ఎకరాల్లో పంటలను ధ్వంసం చేస్తుండడంతో పాటు మనుషుల ప్రాణాలనూ హరిస్తున్నాయి. కురుపాం నియోజకర్గంలో గజరాజుల ప్రవేశంతో ఒంటరి ఏనుగు (హరి) దాడితో 12 మంది బలయ్యారు. అలాగే అనేక మంది గాయాలపాలయ్యారు. తాజాగా జరిగిన ఏనుగుల దాడితో మృతుల సంఖ్య 13కు చేరింది. దీంతో కొమరాడ మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల భయంతో నిత్యం బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గడపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఏనుగుల గుంపును తరలించి ఈ ప్రాంత రైతులు, ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● శ్రీకృష్ణాష్టమి శోభ..!





ప్రతీపల్లె రేపల్లెగా మారింది. కృష్ణాష్టమి వేడుకలను సందడిగా జరుపుకొంది. ఊరూరా నిర్వహించిన ఉట్టికొట్టే సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొనగా.. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోపిక, గోపాలుడు వేషధారణలో చిన్నారులు మురిపించారు. ఆటపాటలతో అలరించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

వేతన యాతన..!

- చిరుద్యోగుల ఆకలి కేకలు
- ప్రభుత్వ బడుల్లో ఆయాలు, వార్డెన్లకు అందని జీతాలు
- కుటుంబం గడవక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పార్వతీపురంటౌన్:

ఇల్లు గడవడం కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనుల్లో వారంతా చేరారు. గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే వారికి జీతం అందపోయేది. కుటుంబం గడుస్తుందనే ఆశతో వేలాది మంది ఆయాలుగా, వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్నారు. అయితే వారిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వారు చేసే కష్టాన్ని గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌కు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో 1599 ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న 1506మంది ఆయాలు, నైట్ వాచ్‌మెన్ ఆకలి కేకలు ప్రభుత్వానికి వినబడడం లేదంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మధ్యాహ్న భోజన పథకంలో వడ్డిస్తున్న ఆయాలు (ఫైల్)

అప్పులు చేసి కుటుంబ పోషణ

నెలవారీగా ఆయాలకు, నైట్ వాచ్‌మెన్‌కు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీలకు అప్పు తీసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌కు రూ.6 వేలు నెలకు ప్రభుత్వం జీతం మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.24 వేలు జీతం పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

జీతాల పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకుల సాయంతో కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించినప్పటికీ ఏ మాత్రం స్పందన లేకపోయిందని వాపోతున్నారు.

జీతాల సమస్యపై వినతిపత్రం ఇస్తే ఉలుకూ పలుకూ లేదంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న తమ జీతాలను మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.


స్పందించాలి



ఆయాలు, నైట్‌వాచ్‌మెన్ జీతాల సమస్యపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలి. చిరుద్యోగుల జీతాల మంజూరుపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నెల జీతం లేకపోవడంతో ఆయాలు, నైట్ వాచ్‌మెన్ వడ్డీకి అప్పులుతీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేదికాదు.

– వాకాడ ఇందిర, సీఐటీయూ జిల్లా నాయకురాలు

జీతాలు పెండింగ్ తగదు



ప్రభుత్వ బడుల్లో పొట్ట కూటి కోసం పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్‌మెన్ జీతాలను నాలుగు నెలలుగా మంజూరు చేయకపోవడం దారుణం. ఈ కొత్త ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సమంజసం కాదు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్ ప్రత్యేక చొరవతో పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– గొర్లి వెంకటరమణ, సీఐటీయూ, జిల్లా నాయకుడు విద్యాశాఖ అధికారులు

జిల్లాలో ఆయాల వివరాలు

మండలం	ఆయాల సంఖ్య
బలిజిపేట	57
భామిని	58
గుమ్మలక్ష్మీపురం	154
గరుగుబిల్లి	56
జియమ్మవలస	96
కొమరాడ	119
కురుపాం	165
మక్కువ	76
పాచిపెంట	97
పాలకొండ	62
పార్వతీపురం	121
సాలూరు	139
సీతంపేట	172
సీతానగరం	68
వీరఘట్టం	66



వైద్య సిబ్బందికి పూర్తి స్థాయి రక్షణ కల్పించాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలి. అత్యవసర విభాగం, వార్డుల్లో సెక్యూరిటీ గార్డులతో పాటు పోలీస్ సిబ్బందిని విధుల్లో ఉంచాలి. అప్పుడే దాడి చేయడానికి ఎవరైనా భయపడతారు.

– కొప్పెన జగదీశ్వరి, స్టాఫ్ నర్స్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, విజయనగరం



దోషులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన దారుణం. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సమాజంలోని అలాంటి మృగాల నుంచి మహిళా వైద్యులను రక్షించేలా డాక్టర్లకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి పక్కాగా అమలు చేయాలి. రాత్రిపగలూ మహిళా వైద్యులకు సెక్యూరిటీ పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించాలి.

– డాక్టర్ పద్మజ, వైద్యురాలు, పార్వతీపురం



క్లుప్తంగా

వ్యాసరచన పోటీలో ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన సరస్వతి

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని టి.సరస్వతి వ్యాసరచనకు జాతీయస్థాయిలో ప్రథమ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి సోమవారం తెలిపారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తాడేపల్లికి చెందిన డీఆర్‌జీ కళాశాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 125 మంది వ్యాసాలు రాయగా 20 మంది విజేతలుగా నిలిచారు. వారిలో తమ కళాశాల విద్యార్థిని సరస్వతి ప్రథమస్థానం దక్కించుకుందని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సరస్వతిని ప్రిన్సిపాల్‌తో పాటు తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తారకేశ్వరరావు అభినందించారు.

చికిత్స పొందుతూ పరవాడ బాధితుడి మృతి



కొవ్వాడ సూర్య నారాయణ(ఫైల్)

వంగర: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం లోని పరవాడ సెజ్‌లో ఈ నెల 23న జరిగిన ప్రమాదంలో గాయపడిన వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన యువకుడు కొవ్వాడ సూర్యనారాయణ(38) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సూర్యనారాయణ మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. హుటాహుటిన విశాఖపట్నం తరలివెళ్లారు. మృతదేహాన్ని చూసిన వారంతా కన్నీటిపర్యంతరమయ్యారు. సూర్యనారాయణ ఐదేళ్ల క్రితం బతుకుతెరువు కోసం వెళ్లి ఈ కంపెనీలో పనిచేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు పారంనాయుడు, గౌరమ్మలున్నారు. మృతుడి భార్య 15 రోజుల క్రితం ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

కంటైనర్ బోల్తా



అదుపుతప్పి పడిపోయిన కంటైనర్

సీతంపేట: పాలకొండ వైపు నుంచి సీతంపేట మీదుగా ఒడిశా వెళ్తున్న భారీ కంటైనర్ సోమవారం ఇసుకగెడ్డ సమీపంలో బోల్తాపడింది. అయితే కంటైనర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

24 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, ఇద్దరు యువకులతో పోలీసులు

శృంగవరపుకోట: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పట్టణ పోలీసులు 24 కిలోల గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బొడ్డవర చెక్‌పోస్ట్ సమీపంలో ఎస్.కోట ఎస్సై సీహెచ్.గంగరాజు నేతృత్వంలో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అరకు నుంచి వస్తున్న స్కూటీని ఆపి తనిఖీ చేయగా, ఆ వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తుల దగ్గర 24కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను కాకినాడకు చెందిన మజ్జి ప్రజ్వల్, ఈతకోట నానిలుగా గుర్తించి కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీఎస్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రయోగం చేసి.. ఫలితం సాధిద్దాం

- వినూత్న ఆలోచనలకు పదును పెట్టాలంటున్న ఉపాధ్యాయులు
- ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు



ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలపై విద్యార్థులకు వివరిస్తున్న డీఈఓ పగడాలమ్మ

పాలకొండ రూరల్: విద్యార్థులంతా వారి మేధస్సుకు పదునుపెట్టి తమలో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వేదికపై కనపర్చాలని సైన్స్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సృజనాత్మక ఆలోచనలు పాఠశాల స్థాయి నుంచే వినూత్న ఆవిష్కరణలు సృష్టించేందుకు దారి చూపే 'ఇన్‌స్పైర్'లో ప్రతిభ కనబరిస్తే గుర్తింపు మెండుగా ఉంటుందని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల చిట్టిబుర్రలో ఆలోచనలకు పదునుపెడితే అబ్బురపరిచేలా ప్రతిభను చూపించగలరని నిరూపించేలా గతంలో ఎన్నో ప్రాజెక్టులు జిల్లా నుంచి రూపొందాయి. ఈ కోవలో కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ అవార్డ్స్' మనాక్ పోటీలను నిర్వహిస్తుంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు, వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పోటీలకు ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. తరగతికి ఒకరు చొప్పున పాఠశాలకు ఐదు ప్రాజెక్టులు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

సెప్టెంబర్ 15 వరకు..

వెబ్‌సైట్లలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబర్ 15 తేదీలోపు విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్ట్ వివరాలను నమోదు చేసుకోవాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థికి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్ట్ ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్‌లో నిర్వహించనున్న సుకుర కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం ఉంటుంది. జపాన్ సందర్శన అవకాశంతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలను కల్పిస్తారు. జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్‌లకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది.



ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్న తలవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఆ ఆలోచన ఉండాలి. తరగతులవారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, అవసరమైన ప్రాజెక్ట్‌ను రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి, విద్యార్థికి సంబంధించిన బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ వివరాలు ఇవ్వాలి. ప్రాజెక్ట్ గురించి సంక్షిప్తంగా రాత పూర్వకంగా పొందుపర్చి సంబంధిత రైటప్ వెబ్‌సైట్లలో నమోదు చేయాలి. ప్రాజెక్ట్ పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్ట్ ఎంపికను రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాస్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం బ్యాంక్ ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

విద్యార్థులకు సహకారం



ఈ పోటీల కోసం విద్యార్థులతో ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నాం. విద్యార్థుల ఆలోచనలు తెలుసుకుని అందుకు తగినట్లుగా అద్భుతమైన ప్రాజెక్ట్‌లను సిద్ధం చేస్తున్నాం. ఈ పోటీ విద్యార్థులకు మంచి భవిష్యత్ అందిస్తుంది. వారిలోని సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసేందుకు ఇదొక గొప్ప అవకాశం. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది విద్యార్థులు మరింత స్ఫూర్తితో ప్రాజెక్టుల తయారీకి సిద్ధమంటున్నారు. నమోదు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

– జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

ప్రతిభను ప్రోత్సహించేలా..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జిజ్ఞాస గల విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్ట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థులతో కలిసి ఐడియాలజీ తరగతులు నిర్వహిస్తున్నాం. హైస్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి ఐదేసి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టులు ఇన్‌స్పైర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

రోగులకు అందని మందులు

- హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ బాధితుల అవస్థలు
- లివర్, కిడ్నీలు త్వరగా దెబ్బతినే ప్రమాదం
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ వ్యాధి గ్రస్తులకు గత కొన్ని నెలలుగా మందులు అందని పరిస్థితి ఉంది. ఈవ్యాధి సోకిన వారు మందులు వాడకపోతే వ్యాధి ముదిరి తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ రోగులు 3 నెలల పాటు మందులు వాడాలి

ఈ రోగులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో ఆర్ఎన్ఏ (రైబో న్యూక్లిక్ యాసిడ్) వైరల్‌లోడ్ పరీక్ష చేస్తారు. హెచ్‌సీవీ రోగులకు ఆర్ఎన్ఏ 10 వేల కంటే ఎక్కువగా ఉంటే మందులు వాడాల్సి ఉంటుంది. అలాగే హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు ఆర్ఎన్ఏ 20 వేల కంటే ఎక్కువగా ఉంటే మందులు వాడాల్సి ఉంటుంది. ఈవిధంగా ఉన్న రోగులు 3 నెలల పాటు మందులు తప్పక వాడాల్సి ఉంటుంది. ఈ మందులు చాలా ఖరీదైనవి కావడంతో ప్రభుత్వమే ఉచితంగా రోగులకు అందించాల్సి ఉంది. హెచ్‌సీవీ రోగికి నెలకు మందులకు రూ.18 వేలు అవుతుంది. హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు నెలకు రూ.3 వేలు అవుతుంది.

నాలుగు నెలలుగా అవస్థలు

హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు గడిచిన నాలుగు నెలలుగా మందులు అందడం లేదు. దీంతో ఈ వ్యాధులు సోకిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయట ఈ మందులు కొనుగోలు చేయలేని పరిస్థితి. హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ వ్యాధిగ్రస్తులకు కిడ్నీ, లివర్ త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అదే మందుల వాడితే ఆర్ఎన్ఏ వైరల్ లోడ్ తగ్గి ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుంది.

మందుల కొరత గురించి తెలీదు

హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ మందుల కొరత ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. మందులు లేకపోతే తెప్పించే ఏర్పాట్లు చేస్తాం.

– డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

భగవద్గీత అనుసరణీయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: సకల మానవాళికి భగవద్గీత ఎంతో అవసరమని, దీన్ని శాస్త్రబద్ధంగా చెప్పేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక, విజయనగరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం గురజాడ కళాభారతిలో శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం రూపంలో ప్రజలకు చేరువ చేసేదే భగవద్గీత అని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుని బోధనలు తెలుసుకోవాలని, అన్ని మతాల సారాంశం ఒకటేనన్నారు. గీతా సారాంశాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఇందూ జ్ఞానవేదిక పాత్ర చాలా గొప్పదని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు వానపల్లి శంకరరావు, సమితి సభ్యులు సీవీఎస్.నాయుడు, ప్రసాద్, సూరిబాబు, ఆదినారాయణ, జగన్నాథం, వంశీ, సీతం నాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు శ్రీకృష్ణభగవానుని చిత్రపటాన్ని అందజేస్తున్న సమితి ప్రతినిధులు

28న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి విజయనగరం జిల్లా బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి కేవీఎస్ రాజు సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనబోయే క్రీడాకారులు 14 నుంచి 16 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అదే విధంగా బాలురు 185 సెంటీమీటర్ల ఎత్తు, బాలికలు 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 1న విశాఖలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కోసం పంపించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919421590, 9550785141 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ

- మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలి
- ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ



స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

విజయనగరం: అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ రాజు అని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని కోటలో రాజా సాహెబ్ డాక్టర్ పీవీజీ రాజు జయంతి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో కూడిన స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ పుస్తకాన్ని మాన్సాస్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఆవిష్కరించగా.. కార్యక్రమంలో మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహనాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ ఎం.భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యక్రమాన్ని మాన్సాస్ విద్యా సంస్థల్లో పనిచేసిన పూర్వ అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, తూ.గో జిల్లాల్లో చదువుతున్న 300 మంది ప్రతిభ గల విద్యార్థులకు ప్రతి ఏటా ఉపకారవేతనాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన సర్వ సంపదను సామాజిక అభ్యున్నతి కోసం దానం మహోన్నత వ్యక్తి డాక్టర్ పీవీజీ రాజు అని కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం ఆయన అందించిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. 4 సార్లు ఎంపీగా, 5 సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు రాష్ట్ర మంత్రిగా రాజకీయంగా సేవలందించిన డాక్టర్ పీవీజీ విజయనగరం ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నేటి తరం కాకుండా రానున్న తరాల వారికి పీవీజీ ఆదర్శప్రాయమైన జీవితాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని వాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రఘురాజు, పాకలపాటి రఘువర్మ, ఎమ్మెల్యే బేబీనాయన, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులకు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో దహన సంస్కారం



తండ్రీకొడుకులకు దహనసంస్కారాలు చేస్తున్న కుటుంబసభ్యులు

రేగిడి: రోడ్డు ప్రమాదంలో ఈనెల 25న శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద మృతిచెందిన తండ్రీకొడుకుల మృతదేహాలకు సోమవారం దహన సంస్కారాలు నిర్వహించారు. రేగిడి మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామానికి చెందిన కరణం రామకృష్ణ, కుమారుడు కిరణ్‌కుమార్‌ల మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే గ్రామం మొత్తం ఒక్కసారిగా ఘొల్లుమంది. మృతుల కుటుంబాల ఆర్తనాదాలతో శోకసంద్రం అలుముకుంది. ఓ వైపు భర్త, మరో వైపు కుమారుడి మృతదేహాలు చూసి రాణీరత్నం గుండెలవిసేలా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. అన్నయ్యా అంటూ కిరణ్‌కుమార్ చెల్లి సాత్విక రోదించిన తీరు చూపరులను కంటతడిపెట్టించింది. రాఖీ కట్టి అండగా ఉంటానని చెప్పి అంతలోనే అనాథను చేస్తావా అంటూ గగ్గోలు పెట్టింది. తన తండ్రి మృతదేహాన్ని పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. ఈ విషాదఘటన చూసిన అక్కడున్నవారి కళ్లు చెమర్చాయి. తండ్రీకొడుకుల మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయని తెలిసిన వెంటనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వారి అంతిమయాత్రలో పాల్గొని, కన్నీటివీడ్కోలు పలికారు. తండ్రీకొడుకులకు మృతదేహాలకు పక్కపక్కనే చితి పేర్చి దహనంచేసిన దృశ్యం పలువురిని కలిచివేసింది.



భర్త, కుమారుడి మృతదేహాల మధ్య రోదిస్తున్న రాణీరత్నం

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

వీరఘట్టం: పొలంలో నీరు కట్టేందుకు వెళ్లిన వీరఘట్టం మండలంలోని తలవరం గ్రామానికి చెందిన రైతు వావిలపల్లి సత్యంనాయుడు(61) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం అనగా వెళ్లిన భర్త సత్యం నాయుడు మధ్యాహ్నం సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య చంద్రమౌళమ్మ చుట్టుపక్కల వారిని అడిగింది..ఎవరూ చూడలేదని చెప్పారు..చివరకు రాత్రి 8.30 గంటల సమయంలో భర్తను వెతికేందుకు గ్రామస్తులతో కలిసి ఆమె పొలానికి వెళ్తుండగా మార్గమధ్యంలో విద్యుత్ స్తంభం దగ్గర భర్త పడిపోయి ఉన్నాడు. ఏం జరిగిందోనని గ్రామస్తులు పరిశీలించగా చెవిలో నుంచి రక్తం కారడంతో పాటు చనిపోయినట్లు గుర్తించారు. సత్యంనాయుడు పొలానికి నీరు కట్టి తిరిగి వస్తుండగా పొలంగట్టుపై ఉన్న విద్యుత్ స్తంభం స్టే వైరు శరీరానికి తగలడంతో షాక్ కొట్టి మృతి చెందినట్లు గ్రామస్తులు భావించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై జి.కళాధర్ సోమవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



సత్యంనాయుడు మృతదేహం

సాలూరులో గజపతినగరం వాసి మృతి

సాలూరు: గజపతినగరానికి చెందిన వ్యక్తి సాలూరు పట్టణంలో సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పట్టణ ఎస్సై సీతారాం మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆర్కే హోటల్ పక్కన ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందిందని చెప్పారు. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఆ వ్యక్తి విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన బక్క తులసి(41)గా గుర్తించారన్నారు. వృత్తిరీత్యా కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో ఉంటున్న ఆయన మూడు రోజుల క్రితం సాలూరు వచ్చి మద్యం మత్తులో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయి మరణించి ఉంటారని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹206